ఉత్సాహంగా.. దాండియా



మంచిర్యాల మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నిత్యం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు మార్వాడీ మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు దాండియా ఆటలతో అలరిస్తున్నారు. నాలుగైదు వలయాలుగా ఏర్పడి దాండియా పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల అర్బన్




నృత్యాలు చేస్తున్న మహిళలు





ట'మాట' అనలేం.. వెల్లుల్లి కొనలేం

● పండగ వేళ కొండెక్కిన 'కూరగాయలు'



మంచిర్యాల అర్బన్, వాంకిడి న్యూస్‌టుడే

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో కుదేలైన పంట పొలాలు, కూరగాయల తోటలతో పట్టణాలకు పెద్ద కష్టమే వచ్చింది. మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతంతోపాటు సిద్దిపేట నుంచి వచ్చే కూరగాయలపై ఉమ్మడి జిల్లావాసులు ఆధారపడ్డారు. వేసవి కాలం మాదిరి వర్షాకాలంలోనూ విపణిలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అధిక వర్షాలతోపాటు ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు లేకపోవడం, శ్రావణం, గణపతి, దేవి నవరాత్రి ఉత్సవాలు వరుసగా రావడం ఇందుకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి...



మార్కెట్‌లో మిర్చిబండ్లు, గప్‌చుప్‌ల వద్ద తప్పనిసరిగా ఉల్లి వాడుతారు. కొద్దిరోజులుగా ఉల్లి ధర దడ పుట్టిస్తుండడంతో వాటిని వాడటమే మానేశారు. ఎందుకంటే మార్కెట్‌లో దాని ధర కిలో రూ. 55. వేసవిలో రూ. 20 ఉన్న ఉల్లి రెట్టింపు కావడంతో వంటల్లో వాటిని వాడడం తక్కువ చేశారు. ఉమ్మడి జిల్లాకు కర్నూలు, సోలాపూర్ నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంది. నెల క్రితం వరకు కిలో రూ. 40 ఉన్న అలుగడ్డ ప్రస్తుతం రూ. 50 పలుకుతోంది. ఉత్తరప్రదేశ్ నుంచి దిగుమతి అయ్యే ఆలుగడ్డ ధరలు ఇప్పట్లో తగ్గడం కష్టమే అంటున్నారు వ్యాపారులు.

ఇతర వాటి పరిస్థితి అంతే..



సంత రోజు కూరగాయలు కొనేందుకు వెళ్తే రూ.500 ఖర్చు అవుతున్నాయి. వారానికి ఇంత ఖర్చయితే ఎలా అని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే ఆకుకూరల ధర కూడా పెరిగిపోయింది. కొత్తిమీర నాందేడ్ నుంచి దిగుమతి కావడంతో రూ.20 ఇస్తే కానీ చిన్న కట్ట ఇవ్వడం లేదు.

వెల్లుల్లిదీ అదే దారి..



కరోనా సమయంలో కిలో రూ. 60 ఉన్న వెల్లుల్లి ధర కొద్ది రోజులుగా కిలో రూ. 320కి చేరింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి ఉమ్మడి జిల్లాకు వెల్లుల్లి వస్తుంది. ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి ధరలు హెచ్చుతగ్గులు ఉంటాయన్నారు. కొత్త పంట వచ్చే వరకు ఈ తిప్పలు తప్పవంటున్నారు.

వర్షాలతో తగ్గిన దిగుమతి

కొద్దిరోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల సాగుకు ఇబ్బంది నెలకొంది. మంచిర్యాల మార్కెట్‌కు సిద్దిపేట, ఒంటిమామిడి, గంగాపూర్, కళ్యాణదుర్గం నుంచి కూరగాయలు వస్తుంటాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని మండలాల్లో టమాట, వంకాయ సాగు చేస్తున్నప్పటికీ తీగజాతి కూరగాయలకు ఇతర ప్రాంతాల మీద ఆధారపడాల్సిందే. నిర్మల్ జిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న, సోయా, పసుపు పంటలు ఎక్కువగా ఉంటాయి. కూరగాయల సాగు చాలా తక్కువ. ఈ జిల్లావాసులు మహారాష్ట్ర, నిజామాబాద్, సిద్దిపేట ప్రాంతాల పంటలపై ఆధారపడుతున్నారు. కుమురంభీం జిల్లాలో రెబ్బెన మండలం గంగాపూర్‌లో కొంత కూరగాయలు సాగు చేస్తున్నప్పటికీ స్థానికంగా విక్రయించడంతోపాటు మంచిర్యాలకు దిగుమతి చేస్తున్నారు.

సామాన్యులకు శరాఘాతం

- గడ్డం మధుకిరణ్, ప్రైవేటు ఉద్యోగి, మంచిర్యాల



గత కొద్దిరోజులుగా కూరగాయల ధరల పెరుగుదల ఆందోళన కల్గిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి కూరగాయ, ఆకుకూర కొనాల్సిందే. టమాట ధర పెరిగిన కొనక తప్పడం లేదు. వీటికి తోడు ఉల్లి, వెల్లుల్లి ధరలు పెరిగాయి. మార్కెట్‌కు రూ. 500తో వెళ్లినా వారం రోజుల పాటు సరిపడా కూరగాయలు రావడం లేదు. కూరగాయలకు బదులు పప్పులు వండాల్సి వస్తుంది.



జిల్లా కేంద్రంలోని ఓ వస్త్ర దుకాణంలో సందడి

మార్కెట్‌కు పండగొచ్చింది

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరాకు ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరిస్తారు. ఏడాదంతా జరిగే విక్రయాలతో పోలిస్తే ఈ పండగ రోజుల్లో జరిగేవి ఎక్కువగా ఉంటాయి. పండగలు సమీపిస్తుండటంతో కొద్దిరోజులుగా మంచిర్యాల మార్కెట్‌లో వస్త్ర, అలంకరణ వస్తువుల దుకాణాలు కళకళలాడుతున్నాయి. జిల్లాలో దసరా పండగ విక్రయాల్లో సింహభాగం సింగరేణి కార్మిక కుటుంబాలదే. కుమురంభీం, పెద్దపల్లి, సిరోంచ, కాళేశ్వరం ప్రాంత ప్రజలు మంచిర్యాలకు వస్తున్నారు. గతంలో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు 20 శాతం పెరిగినట్లు అంచనా. జిల్లాలో ఈ ఏడాది విపణిలో వ్యాపారం ఇప్పటికే రూ.50 కోట్లు దాటగా పండగ రోజు వరకు మరో రూ.50 కోట్లకు చేరుతుందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

డీఎస్సీలో 248 మంది అభ్యర్థుల ఎంపిక



మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే

డీఎస్సీ-2024 ఉపాధ్యాయ ఉద్యోగాల నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో మెరిట్ సాధించిన అభ్యర్థులను 1:3 పద్ధతిలో ఎంపిక చేసి ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారు. అనంతరం 1:1 నిష్పత్తిలో మెరుగైన ర్యాంకులు సాధించిన వారిని ఎంపిక చేసి అధికారులు సంబంధిత పత్రాలను ధ్రువీకరించారు. ఆయా సబ్జెక్టుల్లో రిజర్వేషన్ల వారీగా ఉన్న పోస్టులు, స్థానికత ఆధారంగా అర్హులను ఎంపిక చేశారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు మంగళవారం 1:1 మెరిట్ జాబితాను వెల్లడించారు. ఉద్యోగాలకు ఎంపికైన 248 అభ్యర్థులకు ఈ నెల 9న(బుధవారం) హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నారు. కొత్త ఉపాధ్యాయుల రాకతో ఇక ప్రభుత్వ బడుల్లో కొంత మేర విద్యార్థులకు బోధన ఇబ్బందులు తీరనున్నాయి.

ఆరు బస్సుల ఏర్పాటు

డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆయా కేటగిరీలకు సంబంధించి 248 మంది అభ్యర్థులను హైదరాబాద్ తరలించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి ఎంపికైన ఉద్యోగులు బస్సుల్లో బయలు దేరనున్నారు. ఈ మేరకు 6 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. వీరి కోసం ఆరుగురు ఎంఈవోలను లైజన్ అధికారులుగా ఒక్కో బస్సుకు ఒక పోలీసు అధికారిని నియమించారు. వీరితోపాటు మరో ఇద్దరు ఎంఈవోలు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లను సహాయకులుగా నియమించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.



వారం కిందట సమీకృత మార్కెట్ సముదాయ భవనం



ఒక్కరోజులో నేలమట్టమై..



ప్రస్తుతం తుక్కుగా మారి..

మొన్న భవనంగా.. నిన్న నేలకొరిగి.. నేడు తుక్కుగా మారి

సమీకృత మార్కెట్ సముదాయం కోసం దాదాపు ఏడాదిన్నర కిందట రూ.కోట్లు పైగా నిర్మాణం చేపట్టిన భవనం ఒక్క రోజులో నేలమట్టమైంది. ప్రస్తుతం ఇలా తుక్కుగా మారింది. పట్టణం నడిబొడ్డున మార్కెట్ కంటే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కూల్చివేత చివరి దశకు చేరుకుంది. ఇక నిర్మాణమే మిగిలింది. **- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ**

విద్యుత్తు బదిలీలు వాయిదా

● నిరీక్షించి నిరాశ చెందిన ఉద్యోగులు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

కాస్త ఆలస్యమైనా బదిలీల ప్రక్రియ విద్యుత్తుశాఖ ఎట్టకేలకు చేపట్టిందని ఉద్యోగులు సంతోషించారు. ఏళ్లుగా మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్నవారు పట్టణాలబాట పట్టేందుకు అవకాశం వచ్చిందని ఆనందించారు. పది రోజులుగా ఈ ప్రక్రియ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సాఫీగా జరిగింది. ఓఅండ్ఎం సిబ్బంది తప్ప మిగతా అందరికీ వెబ్‌ఆప్షన్ల ద్వారా బదిలీ చేపట్టారు. కేటాయించిన ప్రాంతాలకు సంబంధించి ఉత్తర్వుల పత్రాలను సైతం సిద్ధం చేశారు. వీటి కోసం జిల్లా నలుమూలల నుంచి జిల్లా కార్యాలయానికి చేరుకుని గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇక స్వీకరించడమే ఆలస్యం అనుకున్న సమయంలో చివర నిమిషంలో జిల్లా అధికారి బదిలీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఆయా ఉద్యోగులు నిరాశతో వెనుదిరిగారు.



సోమవారం రాత్రి జిల్లా విద్యుత్తు సంస్థ కార్యాలయ ఎదుట వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగుల నిరీక్షణ

పది రోజులుగా ఎదురుచూపులు

బదిలీకి సంబంధించి విధి విధానాలను ప్రకటించినప్పటి నుంచి ఆయా ప్రక్రియకు కసరత్తు ప్రారంభమైంది. దాదాపు పది రోజుల నుంచి శాఖలో దీనిపై ఉద్యోగుల చర్చలు జరిగాయి. ఎవరు అర్హులు, ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి, వారికున్న(యూనియన్, కులసంఘాలు, స్పౌజ్) అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ఒత్తిళ్లతో వాయిదా పడ్డాయా..?

చివరి నిమిషంలో బదిలీ ప్రక్రియ వాయిదా పడటంపై ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత మంత్రి విదేశాల్లో ఉన్న సమయంలో చేపట్టారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కొంతమంది అంటున్నారు. మరికొందరు వరంగల్, హైదరాబాద్‌లాంటి ప్రాంతాల్లో పాతుకుపోయి ఈ సారి తప్పనిసరి మరో చోటకు వెళ్లాల్సి వస్తుందనే కారణంతో ఆయా ఉద్యోగులు, కొంతమంది సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొచ్చారని, దీంతో నిలిచిపోయాయని అభిప్రాయపడుతున్నారు. వెబ్‌ఆప్షన్ల విధానాన్ని తీసుకురావడంతో సంస్థలోని పలు యూనియన్ నాయకులకు మింగుడు పడటం లేదని ఇది కూడా కారణం కావచ్చంటున్నారు. వీటినే ఏమైనా మార్పులు చేసి చేపడతారా? వచ్చే ఏడాది వరకు వాయిదా వేస్తారా? అనేది సందిగ్ధంగా మారింది.

జిల్లాలో స్థానచలనానికి అర్హత ఉన్నవారి వివరాలు

డీఈ	1
ఏడీఈ	8
ఏఈఈ(సివిల్)	1
ఏఈ	25
సబ్ ఇంజినీర్	17
ఏఓ	1
జేఏఓ	10
సీనియర్ అసిస్టెంట్	10
జూనియర్ అసిస్టెంట్	4
లైన్‌మెన్	39
అసిస్టెంట్ లైన్‌మెన్	11
లైన్‌ఇన్‌స్పెక్టర్	21

ఎమ్మెల్సీ ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు

ఏసీసీ, న్యూస్‌టుడే: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా రూపకల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఓటు నమోదుకు ప్రత్యేక కేంద్రాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో రాములు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

◆ నెన్నెల మండల కేంద్రానికి చెందిన ఓ యువతికి అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 1,36,000 నగదును కొందరు దళారులు తీసుకున్నారు. నెల రోజుల పాటు స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆమె ఉద్యోగం చేశారు. వేతనం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. దళారులను నిలదీయడంతో చెల్లని చెక్కు ఇచ్చారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలువురిపై కేసు నమోదు చేశారు.

◆ కాసిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన కొందరు నిరుద్యోగులకు తెలిసిన ఓ వ్యక్తి మీ మండలంలోని పాఠశాలల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా కేంద్రంలోని ఏజెన్సీ నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగులు అతడి వద్దకు వెళ్లగా ఓ దరఖాస్తు పత్రాన్ని చేతిలో పెట్టి రూ. 5 వేలు ఇవ్వాలని కోరగా నగదు చెల్లించారు. నియామకాలు పూర్తయిన వెంటనే మిగతా రూ. 1.50 లక్షల నగదు చెల్లించాలని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

◆ ఇటీవల ఓ యువకుడు కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలో అటెండర్‌గా విధుల్లో చేరారు. వారం రోజులకే మరో యువకుడు ఇదే కళాశాలలో అటెండర్‌గా నియమితులైనట్లు ఓ ఏజెన్సీ పత్రాన్ని పట్టుకొని వచ్చారు. ఒకే కళాశాలలో ఇద్దరు యువకులకు రావడంతో మోసపోయినట్లు గుర్తించారు.

ఉత్తుత్తి ఉద్యోగాలు

● ఏజెన్సీల పేరిట నిరుద్యోగుల నుంచి రూ. లక్షల్లో దండుకుంటున్న వైనం




కాసిపేట, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాలు చేపడుతున్నామని నిరుద్యోగుల నుంచి ఉద్యోగాల పేరిట ఓ ఏజెన్సీ నిర్వాహకులు రూ. లక్షలు దండుకుంటున్నారు. నిరుద్యోగులే లక్ష్యంగా ఉద్యోగాలు కల్పిస్తామని, పని తర్వాతనే నగదు చెల్లించాలని మాయమాటలు చెబుతున్నారు. పేరు నమోదు పేరిట నగదు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు విద్యావనరుల కేంద్రంలో అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాల పేరిట ఓ దరఖాస్తు పత్రాన్ని తయారు చేయించుకొని నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి ఒక్కరి నుంచి తొలుత రిజిస్ట్రేషన్ పేరిట రూ. 5 నుంచి 10 వేల వరకు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అధికారులేమో అలాంటి నియామకాలు ఏమీ లేవని నమ్మి నగదు ఇవ్వొద్దని చెబుతున్నారు.

వేతనం రూ. 20 వేలంటూ..

ప్రతి పాఠశాలలో నియమించే అటెండర్ పోస్టులకు నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు చెల్లిస్తామని మాయమాటలు చెబుతున్నారు. కరోనాకు ముందుగా ప్రతి పాఠశాలలో పార్ట్ టైం వర్కర్ల పేరిట ప్రభుత్వమే రూ. 2 వేల నుంచి 3 వేల వరకు చెల్లించేవారు. ఆ తర్వాత వర్కర్ల పోస్టులను ప్రభుత్వమే రద్దు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్ట్ టైం వర్కర్లు లేరు. ఈ విద్యా సంవత్సరంలో ఆ నియామకాలను ప్రభుత్వం ఏజెన్సీ ద్వారా తమకు అవకాశం కల్పించిందని చెబుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ఏజెన్సీ పేరిట దరఖాస్తు పత్రాన్ని తయారు చేయించి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నియామకాలు పూర్తయిన వెంటనే ఉద్యోగానికి రూ.1 లక్ష నుంచి రెండు లక్షల వరకు చెల్లించాలని ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం. వీరిని నియమించుకునే సమయంలో కళాశాలలు, పాఠశాలల్లో ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులు చాలా చోట్ల అభ్యంతరం చెప్పకపోవడం కొసమెరుపు. ఈ అక్రమార్కులను జిల్లా స్థాయి అధికారులు సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



To,
THE HEAD MASTER,
ZPHS NENNAL
MANCHERIAL DIST, TELANGANA

Subject: Appointment of Attender for Academic year of 2023-2028 under Vidyanjali 2.0 volunteer program by Department of School Education & Literacy, Ministry of Education Govt of India.

Respected sir & Madam,
We are pleased to inform you that Mr./Miss. SWARNALATHA BURAM W/O VENKATESH BURAM is appointed as Attender for academic year 2023-2028 at ZPHS Nennal UDISE (36031000...04) NENNAL (M), MANCHERIAL Dist. of TS W.e.f: 29/06/2024.

The Code of Conduct is as Follows: -
These guidelines are applicable to central and State Government and Government aided schools.

Department of School Education & Literacy, Ministry of Education, reserves the right to revise the terms and Conditions in respect of continuation as Attender or [illegible] department or school education & literacy at any time. All Attender are deemed to be bound by any changes therein.

No liability would be there towards subject Assistant for any direct, indirect, incidental or consequential damages arising out of or in any way connected with any activity/contribution which might be delegated to the Attender or any employee of the DoSL instructions.

Remuneration is given by KUNA INFO only based on their attendance report and daily activities conducted in respective schools. Here No remuneration is payable to Attender under this initiative by schools, state/UT or Central Government.

For Kuna info solutions Pvt. Ltd.

ఓ ఏజెన్సీ నిర్వాహకులు అందించిన నకిలీ పత్రం


విద్యుద్దీపాలంకరణలో ఆలయం


గదులు లేకపోవడంతో ఆరుబయట నిద్రిస్తున్న భక్తులు

మూల నక్షత్ర వేడుకలకు బాసర సిద్ధం

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతి ఆలయం బుధవారం మూల నక్షత్ర వేడుకలకు ముస్తాబైంది. సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం మూల కావడంతో ఈ వేడుకలకు ప్రత్యేకత ఉంది. వేకువజామున రెండు గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారికి వశుషష్టి పూజలు, హారతి, నివేదన కార్యక్రమాలు సాగుతాయి. ఈ శుభఘడియల్లో ఆలయంలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగురాష్ట్రాల నుంచి భక్తులు రైళ్లు, బస్సులు, సొంతవాహనాల ద్వారా బాసరకు చేరుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బాసరకు భక్తుల రాక మొదలైంది. నవరాత్రి ఉత్సవాల్లో ఒకరోజు సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రం వస్తుంది. ఆ రోజు అమ్మవారి చెంత అక్షరాభ్యాసాలు నిర్వహిస్తే ప్రయోజకులవుతారనే విశ్వాసంతో భక్తులు భారీగా తరలివస్తారు. అక్షరాభ్యాసాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి


సరస్వతి అమ్మవారి మూల నక్షత్ర వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్షరాభ్యాసాలు, దర్శనాలు, భక్తుల సమయంలో భక్తులకు సమస్యలు తలెత్తకుండా దేవాదాయశాఖ జాగ్రత్తలు తీసుకుంది. రద్దీకి అనుగుణంగా అక్షరాభ్యాస మండపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అదనపు టికెట్ కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఈసారి వీవీఐపీ పాసులను రద్దు చేశారు. ప్రముఖులకు దర్శనాలు చేయించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. అందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేసిన వారికి ప్రత్యేకంగా వరుస ఏర్పాటు చేసి వారికి దర్శనం కల్పించనున్నారు. ఉచిత దర్శనం, రూ.150 అక్షరాభ్యాసాలకు పోలీస్‌స్టేషన్ వైపు నుంచి, ప్రత్యేక దర్శనం కోసం ఆలయాధికారి కార్యాలయం ఎదుటి నుంచి వరుసలను ఏర్పాటు చేశారు. వరుసలో ఉన్న భక్తుల కూర్చునేలా బెంచీలను ఏర్పాటు చేశారు. భద్రత, పార్కింగ్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భక్తుల సేవలకు పలు సంఘాలు, భక్తబృందాల సేవలను ఆలయం వినియోగించనుంది. పుణ్యస్నానాల వేళ భక్తుల భద్రత కోసం గోదావరి నది వద్ద ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ నిజామాబాద్, భైంసా డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోంది.


క్యూలైన్లలో భక్తులు కూర్చోవడానికి ఏర్పాటుచేసిన బెంచీలు

నిండిన గదులు.. ఆరుబయటే భక్తులు

ఆలయానికి చెందిన వంద వసతి గదులు మరమ్మతుల్లో ఉండటం, మిగిలిన వసతి గృహాలు ప్రముఖులకే కేటాయించడంతో బాసరకు వచ్చే భక్తులకు వసతి కష్టాలు మొదలయ్యాయి. ప్రైవేట్ లాడ్జీల్లో గదుల ధరలు రెండింతలు చేశారు. దీంతో సామాన్య భక్తుల పరిస్థితి దారుణంగా తయారైంది. డబ్బు ఉన్న వారు ప్రైవేట్ గదులను అధిక ధరకు తీసుకున్నారు. డబ్బులు లేని వారు ఆరుబయటనే సేదతీరుతూ వేచిఉన్నారు. కొందరు భక్తులు నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి పట్టణాల్లోనే బసచేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వీరంతా బుధవారం ఉదయం బాసరకు రానున్నారు.

☛ జిలాలోని ఓ మండలానికి చెందిన వ్యాపారికి తొలి సంతానంగా కుమార్తె పుట్టింది. రెండో కాన్పులో కూడా కూతురు పుడుతుందేమోనని భావించి మహారాష్ట్రలో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. మగ బిడ్డ ఉన్నట్లు ముందే తెలుసుకున్నాడు. ఒక వేళ ఆడపిల్ల ఉంటే పరిస్థితి మరోలా ఉండేది.



నేడు పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తిని ఆరాధించే ప్రజలే ఆడపిల్ల అంటే చిదిమేస్తున్నారు. శివుడిలో సగం.. అవనిలో సగం అంటూనే తమ ఇంట మాత్రం వదిలించుకోవాలని చూస్తున్నారు. కాసుల కోసం కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు పుట్టబోయేది ఆడ, మగ అనేది ముందే చెప్పేస్తూ.. భ్రూణహత్యలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలో నిరాక్షరాస్యత, పేదరికం కూడా వాటికి తోడవుతోంది.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం

ఆదిశక్తి ఆరాధన.. ఆడపిల్లకు నిరాదరణ

ఇలా చేస్తే ప్రయోజనం..

- లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయమై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి
- వరకట్న నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. వరకట్నం తీసుకున్నట్లు తెలిసినా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలి.
- ఆడపిల్లల చదువు కోసం గతంలో మాదిరిగా బంగారుతల్లి వంటి పథకాలను అమలు చేయాలి
- ఆడ శిశువులకు జన్మనిచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందించాలి
- స్వయం ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం మరింత పెంచాలి

లింగనిష్పత్తి

జిల్లా	బాలురు	బాలికలు
ఆదిలాబాద్	1000	989
నిర్మల్	1000	1046
కుమురం భీం	1000	998
మంచిర్యాల	1000	977

● ఆందోళన కలిగిస్తున్న బాలబాలికల నిష్పత్తి

● జిల్లా ● 0 నుంచి 6 ఏళ్ల పిల్లలు ● బాలురు ● బాలికలు

జిల్లా	0 నుంచి 6 ఏళ్ల పిల్లలు	బాలురు	బాలికలు
కుమురంభీం	66206	34053	32153
నిర్మల్	82769	42,462	40,307
మంచిర్యాల	73725	38578	35147
మంచిర్యాల	89,283	46,225	43058



ఆడపిల్లల సంఖ్య తగ్గడానికి కారణాలు ఏమిటి? జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్ష నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేస్తున్నారా? ఆడపిల్లల సంఖ్య పెరగడానికి ప్రభుత్వం ఏం చేయాలన్న అంశాలపై జిల్లాలో 100 మందిపై 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

● జనాభా ● పురుషులు ● మహిళలు







జిల్లా	జనాభా	పురుషులు	మహిళలు
కుమురంభీం	5,15,812	258197	257615
నిర్మల్	709418	346721	362697
మంచిర్యాల	807037	408272	398765
ఆదిలాబాద్	7,08972	3,56,407	3,52,565


మహారాష్ట్రలో లింగ నిర్ధారణ పరీక్షలు..

జిల్లాలోని పలు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులపై అధికారుల నిఘా కరవైంది. గతంతో పోల్చితే నిర్ధారణ పరీక్షలు తగ్గినా.. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు సమాచారం. కొంత మంది స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఆడ, మగ అన్నది కోడ్ రూపంలో తెలియజేస్తున్నారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లావాసులు సరిహద్దులోని మహారాష్ట్రకు లింగ నిర్ధారణ పరీక్షల కోసం వెళ్తున్నారు. అక్కడి ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు డబ్బుల ఆశతో ఆడ, మగ అన్నది తెలియజేస్తున్నాయి. ఫలితంగా చాలా మంది అక్కడే గుట్టుచప్పుడు కాకుండా పరీక్షలు చేసుకుంటున్నారు.

1 నేటి సమాజంలో చదువు, ఇతర విషయాల్లో ఆడ, మగ పిల్లలకు సమ ప్రాధాన్యం ఉందా?



2 లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు, వరకట్న నిషేధం వంటి వాటి నియంత్రణ, మహిళల భద్రతలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయా?



నేత్రపర్వం.. ధనలక్ష్మి రూపం

చెన్నూరు పట్టణంలోని ఆర్య వైశ్య సంఘ భవనంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి మండపాన్ని ఉత్సవ నిర్వాహకులు రూ.25,25,555 కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే, చెన్నూరు


చెన్నూరులోని ఆర్యవైశ్య సంఘ భవనంలో దుర్గాదేవి మండపాన్ని రూ.25,25,555లతో అలంకరించిన నిర్వాహకులు

తాపీమేస్త్రీలు.. సహాయకులకు



దండేపల్లిలో గోడల నిర్మాణంపై మహిళలకు శిక్షణ ఇస్తున్న చిత్రం ఇది. పునాది వేయడం దగ్గర నుంచి భవన నిర్మాణం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పగుళ్లు రాకుండా ఉండాలంటే సామగ్రి ఎంపికతోపాటు వీటిని ఏ నిష్పత్తిలో కలపాలి, సరైన కొలతల ప్రకారం ఎలా నిర్మించాలో తెలియజేస్తున్నారు. నాణ్యత, అందంగా ఉండటానికి చేపట్టాల్సిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

కూలీల కుటుంబ సభ్యులకు..



ఆదిలాబాద్‌లో మహిళలకు ఇస్తున్న కుట్టు మిషన్ శిక్షణ చిత్రమిది. మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నారు. వీరికి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ అందజేయనున్నారు. కూలీల కుటుంబ మహిళా సభ్యులతోపాటు గుర్తింపు కార్డు ఉన్న మహిళలకు సైతం శిక్షణ ఇస్తారు. కుట్టుతోపాటు ఎంబ్రాయిడరీ, కంప్యూటర్‌తో మెరుగులు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి బాసట

దండేపల్లి, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు మహిళలు సైతం వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. తమలోని సృజనాత్మకతతో వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. భవన నిర్మాణ మేస్త్రీల దగ్గర నుంచి కుట్టు మిషన్, ప్లంబర్, గోడలకు పెయింటింగ్ ఇలా పలు రంగాల్లో రాణిస్తూ మార్పులకు అనుగుణంగా తమ వృత్తులను మెరుగుపర్చుకుంటున్నారు. వీరిలో ఉన్న వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు జాతీయ నిర్మాణ అకాడమీ(న్యాక్) యువతకు శిక్షణ ఇస్తోంది. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న నిరుద్యోగ పురుషులతోపాటు మహిళలకు సైతం తరగతులు నిర్వహిస్తూ వృత్తులపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.

● దండేపల్లిలో పురుషులతోపాటు మహిళలకు శిక్షకుడు వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కూలీలు, తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబరు, వెల్డింగ్, పెయింటింగ్ తదితర వృత్తుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు. 15 రోజులపాటు శిక్షణ ఇవ్వడంతోపాటు రోజుకు రూ. 300లతోపాటు దుస్తులు, హెల్మెట్ అందజేస్తారు.


కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గోడలకు రంగులు వేయడంపై శిక్షణ పొందుతున్న మహిళలు

ఉపయోగకరంగా ఉంది: చింతల లహరి, కిష్టాపూర్, జన్నారం మండలం



వారం రోజులుగా దండేపల్లిలో నిర్వహిస్తున్న కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నాను. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ మాతో పనులు చేయిస్తున్నారు. కుట్టుతోపాటు తాపీమేస్త్రీ, సిమెంటు పనులపై శిక్షణ తీసుకుంటున్నాం. ఇది చాలా ఉపయోగకరంగా ఉంది.

రుణాలు పొందే అవకాశం

ఎం.నాగేంద్రం, న్యాక్ సహాయ సంచాలకుడు(ఏడీ), ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా



న్యాక్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీల నుంచి వివిధ వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. 15 రోజులపాటు తరగతులు నిర్వహిస్తూనే, క్షేత్రస్థాయిలో వివిధ అంశాల్లో మెలకువలు నేర్పుతున్నాం. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించడంతోపాటు నిబంధనల మేరకు రుణాలు అందించే అవకాశం ఉంది.

పసిపాప పాల కోసం ఆవు విరాళం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం టెంబ్రీగూడకు చెందిన పసిపాప దయనీయ పరిస్థితిని 'ఈనాడు'లో చూసి బోథ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.హుస్సేన్ చలించారు. మంగళవారం ఇచ్చోడ జై శ్రీరామ్ గోశాల నుంచి ఆవు, దూడను పసిపాప తండ్రికి అందజేశారు. దేశ్‌ముఖ్ మారుబాయి ఆడపిల్లకు జన్మనిచ్చిన 23 రోజులకే చనిపోయింది. తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకోసారి పాల డబ్బా కొనుగోలు కోసం పడుతున్న పాట్లపై 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలోమీటర్ల కాలినడక' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 5న కథనం ప్రచురితమైంది. కథనాన్ని చూసి న్యాయమూర్తి స్పందించారు. ఆవును, దూడను వారికి ఇచ్చారు. గోశాల నిర్వాహకుడు రాజేశ్ ఉన్నారు. మరోవైపు మానవతావాదులు తమ వంతుగా ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు విరాళాలు రూ. 32,400 జమయ్యాయి.


పసిపాప తండ్రికి ఆవు, దూడను అందజేస్తున్న న్యాయమూర్తి హుస్సేన్

వందనం

బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి పట్టణం: నకిలీ నియామక పత్రాలు అందజేస్తున్న బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ పరిధిలో విద్యాంజలి 2.0 ప్రత్యేక పోర్టల్‌ను తీసుకొచ్చిందన్నారు. కొంతమంది ఈ పోర్టల్‌ను దుర్వినియోగం చేస్తూ ఉచితంగా వాలంటీర్లను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తామని నిరుద్యోగుల నుంచి రూ. లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఆ విద్యార్థులది గ్రామీణ నేపథ్యం. చదువంటే ఎంతో మక్కువ. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతోపాటు వివిధ అంశాల్లోనూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వారిలోని సృజనాత్మకతను గుర్తించి 28వ 'ప్రేరణ' జాతీయ సదస్సుకు ఎంపికయ్యే అవకాశం వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చదువుకున్న గుజరాత్‌లోని వాద్‌నగర్ పాఠశాలలో సెప్టెంబరు 21-28 తేదీల మధ్య నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. తెలంగాణ నుంచి కేవలం ఒక్క నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు మాత్రమే చోటు లభించడం విశేషం.

-న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, గైడ్ టీచర్

గ్రామీణ నేపథ్యం.. అరుదైన అవకాశం

● 'ప్రేరణ' జాతీయ సదస్సు.. రాష్ట్రం నుంచి నిర్మల్ జిల్లా విద్యార్థులు

మామడ మండలం కొరటికల్‌కు చెందిన ఎం.రాజేందర్-లక్ష్మి దంపతుల కుమారుడు రాహుల్ ప్రస్తుతం స్వగ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి కులవృత్తి నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి. చదువే ధ్యేయంగా నిత్యం పరితపిస్తూ ముందుకెళ్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోలి ముఖదంగూడ గ్రామానికి చెందిన ఎస్. హరీంద్రకుమార్-శ్వేత దంపతుల కూతురు ఎస్. హర్షిత నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి ప్రైవేటు అధ్యాపకుడు, తల్లి గృహిణి. అయిదో తరగతిలో పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి విద్యాలయంలో సీటు సంపాదించాడు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రేరణ మహోత్సవం'లో భాగంగా 'ఏక్ భారత్-వికసిత్ భారత్' పేరిట పాఠశాల, జిల్లా స్థాయిలో సహపాఠ్యాంశాలైన వ్యాస రచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వీటికి కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ నోడల్ అధికారిగా వ్యవహరించి ఏప్రిల్-మే నెలలో నిర్వహించిన పోటీల్లో వీరిని ఎంపిక చేశారు.


గుజరాత్‌లోని మ్యూజియం విశేషాలను విద్యార్థులకు వివరిస్తున్న గైడ్

ప్రప్రథమంగా..

ఇప్పటి వరకు నిర్వహించిన జాతీయ సదస్సుల్లో జిల్లా నుంచి ఎంపికైన వారు లేరు. 28వ ప్రేరణకు మాత్రం రాష్ట్రం నుంచి అదీ నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికవ్వడం చెప్పుకోదగ్గ విషయం. వీరికి గైడ్ టీచర్‌గా నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయం పీజీటీ (ఆంగ్ల బోధకురాలు) బి.కల్పన వ్యవహరించారు. వీరితోపాటు అసోం, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, జమ్మూకశ్మీర్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థిని, విద్యార్థులకు చోటు లభించింది. ప్రయోగాత్మక, బోధనోపకరణాలు, విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని నిపుణులైన నవోదయ విద్యాలయాలకు చెందిన సీనియర్ బోధకులు వివరించారు. సత్యం, అహింస, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, చరిత్రాత్మకమైన వాటి విశేషాలు సదస్సులో చెప్పారు. సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములయ్యేలా చైతన్యం తీసుకొచ్చేలా బోధించారు. శిక్షణతోపాటు అక్కడి విశేషాలు, చరిత్రాత్మక ప్రాంతాలను సందర్శించామని, ఇది ఎంతో గొప్ప అవకాశమని వారు వెల్లడించారు.

జిల్లాకు గర్వకారణం:

రవీందర్‌రెడ్డి, డీఈఓ, నిర్మల్

'ప్రేరణ' జాతీయ స్థాయి సదస్సుకు రాష్ట్రం నుంచే జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై అక్కడ శిక్షణ పొంది రావడం గర్వకారణం. ఈ కార్యక్రమం వారిలో ఆత్మస్థైర్యం, భవిష్యత్తులో లక్ష్య సాధనకు దిక్సూచిలా మారనుంది. పోటీ పరీక్షలకు మార్గదర్శకం. ఏకాగ్రత, చదువుపై మక్కువ పెరుగుతుంది. ఇలాంటి వారిని గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించేలా ఏటా జిల్లా నుంచి ప్రాతినిధ్యం లభించేలా పిల్లలను తీర్చిదిద్దేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ పట్టణంలో కలకలంగా మారింది. తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన గౌడ రాజు(25)-గౌడ వైష్ణవి(22)లకు మూడేళ్ల కిందట వివాహమైంది. వైష్ణవి ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు మొదటి ఏడాది చదువుతోంది. ఇటీవల ఆమె జైనథ్ మండలం మాండగడలోని తల్లి గారింటికి వెళ్లింది. మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమె భర్తకు ఫోన్ చేసి రావాలని చెప్పింది. దీంతో ఆయన ఆదిలాబాద్‌కు రాగా ఇద్దరు కలిసి స్థానిక గాంధీ ఉద్యానవనానికి వెళ్లారు. అక్కడ వారిద్దరు పురుగు మందు తాగేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తమను కలిసి ఉండనివ్వడం లేదని, తరచూ వేధిస్తున్నారంటూ వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్‌ను విచారించగా దంపతులు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన విషయమై ప్రాథమిక విచారణ జరుపుతున్నామన్నారు. ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. న్యాయమూర్తి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:
? పట్టణంలోని కృష్ణమందిర్ రోడ్డులో మురుగు పారుతుంది. వెనకాల గల్లీలో మురుగుకాల్వ నుంచి నీళ్లు వస్తున్నాయి. రోడ్డుపై నిత్యం మురుగు పారడంతో దుర్వాసన వస్తుంది. - రమేష్, బజార్‌ఏరియా
✔ కృష్ణమందిర్ రోడ్డులో మురుగు పారకుండా చర్యలు చేపడతాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. మురుగుకాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. - వైజయంతం, పారిశుద్ధ్య అధికారి

కోటపల్లి, న్యూస్‌టుడే:
? కోటపల్లి నుంచి చెన్నూరు మార్గమధ్యలోని ప్రధాన రహదారిపై పిచ్చి మొక్కలు కమ్ముకున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - అశోక్, ప్రయాణికుడు
✔ రహదారిని పరిశీలించి పిచ్చిమొక్కలు తొలగిస్తాం. - భరత్, ఆర్‌అండ్‌బీ, జేఈ

కన్నెపల్లి, న్యూస్‌టుడే:
? సన్నం రకం వరి పంటకు ఆకు ముడత, పీక పురుగు వంటి తెగుళ్లు ఆశించాయి. - కన్నెపల్లి రైతులు
✔ పంటలను పరిశీలించి పురుగు మందుల వివరాలు తెలియజేస్తాం. - అలేఖ్య, వ్యవసాయ విస్తరణ అధికారి

రైలు ఢీకొని మృతి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి -బెల్లంపల్లి రైల్వే మార్గం మధ్యలో మంగళవారం రైలు ఢీ కొని శంకర్ (49) అనే వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన శంకర్ బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. రామన్‌కాలనీ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి యాపల్‌లో ఎం.తిరుపతి (32) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కూలి పనిచేసుకునే తిరుపతికి ఏడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైంది. అప్పటి నుంచి పని చేయలేక ఇబ్బంది పడుతుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి ఒకరి బలవన్మరణం

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చెన్నూరు మండలంలోని చింతలపల్లి గ్రామానికి అల్లంపల్లి పోచన్న(38) పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. చెన్నూరు ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. పోచన్నకు 15 ఏళ్ల క్రితం స్వరూపతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు కాగా పోచన్న మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మద్యం మత్తులో ఉన్న పోచన్న సోమవారం రాత్రి పురుగు మందు తాగాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం గ్రామీణ సీఐ అఫ్జలుద్దీన్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. గంజాయి సేవించే అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత గంజాయికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి అలవాటుతో యువత ఆర్థికంగా, శారీరకంగా అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. సులభంగా డబ్బులు వస్తున్నాయనే ఆలోచనతోనే పక్క రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సేవిస్తున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలని సూచించారు. ఆయన వెంట రెండో పట్టణ ఎస్‌ఐ మహేందర్ ఉన్నారు.


చెన్నూరు పద్మశాలి భవనంలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు


చెన్నూరులో యువతి


చెన్నూరు శివాలయం ఆవరణలో ..

చిత్తుచిత్తుల బొమ్మ.. శివుని ముద్దులగుమ్మ


క్యాతనపల్లి పుర కార్యాలయం ఎదుట ...

చెన్నూరు, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ పండగ సంబరాలను మంగళవారం సాయంత్రం చెన్నూరు పట్టణ మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. ఏడు రోజుల పాటు అత్యంత వైభవోపేతంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించిన బ్రాహ్మణులు, పద్మశాలీలు, ముదిరాజ్ మహిళలు సద్దుల బతుకమ్మ ఆటలాడి వేడుకలకు ముగింపు పలికారు.


చెన్నూరులో ఏకరూప దుస్తులు ధరించి సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు


వెల్గనూర్‌లో 2009-10 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దండేపల్లి మండలం వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2009-10 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి గురువులను ఘనంగా సత్కరించారు.

భాజపా సంబరాలు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: హరియాణాలో మూడోసారి భాజపా అధికారంలోకి రావడంపై పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. సోమవారం పట్టణంలో టపాకాయలు కాల్చుతూ మిఠాయిలు తినిపించుకున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు విశ్వసించారన్నారు. పురుషోత్తంజాజు, కృష్ణమూర్తి, రఘునందన్, రాము, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


భాజపా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌కు మిఠాయి తినిపిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

ఎన్నికల హామీల అమలుకు కృషి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. మంగళవారం రవీంద్రఖని-5 గని వద్ద మాట్లాడుతూ లాభాల వాటా పంపిణీపై ఇతర సంఘాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. కార్మికులకు సొంతింటి పథకం అమలయ్యేలా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీరభద్రయ్య, సమ్మయ్య, బాజీసైదా, ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

సంస్థ పురోగతిపై ఉద్యోగులకు అవగాహన

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణి అభివృద్ధి, ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉద్యోగుల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు మల్టీ డిపార్టుమెంటల్ కమిటీలు ఏర్పాటు చేయాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఏవీ రెడ్డి, గోపాల్‌సింగ్, రాముడు పాల్గొన్నారు.



సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

తాండూరు: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయ ప్రాంగణంలో ఈ నెల 10న జరగబోయే సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను గోలేటి ఏరియా ఎస్‌ఓటు జీఎం రాయమల్లు, పర్సనల్ మేనేజర్ తిరుపతి తెలిపారు. మంగళవారం గోలేటి ఏరియా పరిధిలోని మాదారం టౌన్‌షిప్ కోదండ రామాలయ పరిసరాలను పరిశీలించారు. బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన మహిళలకు సింగరేణి తరఫున బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న జీఎం బి.సంజీవరెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట: కాసిపేట- 2 గనిలో నెలకొన్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని హెచ్ఎమ్మెస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాసిపేట- 2 గనిని సందర్శించి కార్మికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికుల వాహనాల కోసం నిర్మించిన షెడ్డు దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారిందన్నారు. ఫ్యాన్ ఆపరేటర్లకు గదిని నిర్మించాలని సూచించారు. లాభాల వాటాల పంపిణీలో కార్మికులు మోసపోయారన్నారు. నాయకులు సుదర్శన్, శ్రీనివాసరెడ్డి, స్వామి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో బతుకమ్మ ఆడుతున్న జీఎం సతీమణి స్వరూపరాణి, ఉన్నతాధికారుల సతీమణులు

అట్టహాసంగా సింగరేణి వేడుకలు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి సీఈఆర్‌క్లబ్‌లో సింగరేణి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్, సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి దేవేందర్‌లు జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమంపై సంస్థ రాజీపడబోదన్నారు.


మందమర్రిలో నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రియుడి వేధింపులు తట్టుకోలేక ప్రియురాలి బలవన్మరణం

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రియుడి వేధింపులు తట్టుకోలేక ప్రియురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బెల్లంపల్లి మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి చెందిన యటకర్ల రాజ్‌కుమార్, బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామానికి చెందిన అంజలి(18) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆమె చరవాణికి రాజ్‌కుమార్ కాల్ చేయగా పలుమార్లు బిజీ రావడంతో గ్రామానికి వచ్చి కొట్టాడు. రెండు రోజుల కిత్రం గ్రామానికి వచ్చి బతుకమ్మ ఆడొద్దని కొట్టాడు. అంతేకాక రూ. 5 లక్షలు కట్నం ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని తెగేసి చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన అంజలి మంగళవారం వేకువజామున ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

భవనాల కూల్చివేతతో ప్రభుత్వానికి భారీ నష్టం

★ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల పట్టణంలోని ఐబీ ఆవరణలో నిర్మిస్తున్న భవనాలను కూల్చివేయడంతో ప్రభుత్వానికి రూ.10 కోట్ల మేరకు నష్టం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. ఇప్పటికే అక్కడ నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని కూల్చివేశారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు మార్కెట్ సౌకర్యం కల్పించడం తప్పేనా అంటూ ప్రశ్నించారు. మంచిర్యాలలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ ఆవరణలో రూ.2.20 కోట్లతో ఇటీవల నిర్మించిన ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయం, అంతకుముందున్న గెస్టుహౌజ్ భవనాలను కూల్చివేసే నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మార్కెట్ కమిటీ భవనం ఎక్కడ నిర్మిస్తారో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పురపాలక సంఘం మాజీ అధ్యక్షుడు పెంట రాజయ్య, పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, భారాస నాయకులు అంకం నరేష్, విజిత్‌రావు, వై.తిరుపతి, తోట తిరుపతి, మొగిళి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


మంచిర్యాలలోని బైపాస్‌రోడ్డులోని ప్రైవేటు వెంచర్‌కు లారీలో తరలిస్తున్న మట్టి

ప్రైవేటు వెంచర్లకు అక్రమంగా మట్టి తరలింపు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణలో ఇటీవల కూల్చివేసిన సమీకృత మార్కెట్ భవనం మట్టిని ప్రైవేటు వెంచర్లకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది క్రితం రూ.7.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తి కాలేదు. అక్కడ ఇటీవల మాతాశిశు ఆరోగ్య కేంద్రం నిర్మించడం కోసం నిర్మాణంలో ఉన్న మార్కెట్ భవనాలను కూల్చివేశారు. ఇందులో వెలువడిన మట్టిని, సిమెంటు పిల్లర్లను బైపాస్‌రోడ్డులోని ఓ ప్రైవేటు వెంచర్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

జన్నారం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో జన్నారం మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు చోటు దక్కినట్లు ఆ సంఘం జన్నారం మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి తెలిపారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర 35వ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గాజుల చంద్రశేఖర్, పిట్ట రాజారావుకు అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: దేవి నవరాత్రుల సందర్భంగా మందమర్రి మండలం ఆదిల్‌పేట గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారి విగ్రహం వద్ద అభిషేకం, నవగ్రహ పూజలు చేసి వివిధ రకాల నైవేద్యం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు


ఏసీసీలో కరెన్సీ నోట్లతో అలంకరించిన దుర్గాదేవి


గణేష్‌నగర్‌లో..

మంచిర్యాల సిటీ, అర్బన్, పట్టణం, విద్యావిభాగం, శ్రీరాంపూర్ గ్రామీణం, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి పట్టణం న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆలయాలు, మండపాల వద్ద అన్నదానాలు, చండీహోమం, కుంకుమపూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.


షంషీర్‌నగర్‌లో కుంకుమ పూజ అనంతరం గాజులను చూపిస్తున్న మహిళా భక్తులు


రాంనగర్‌లో మహాలక్ష్మి రూపంలో అమ్మవారు


కైలాసగిరి కాలనీలో చండీహోమం..


శ్రీరాంపూర్ గ్రామీణం : పూజల్లో పాల్గొన్న జీఎం బి.సంజీవరెడ్డి-రాధా కుమారి దంపతులు


ఆర్కేపీలో ..

సంక్షిప్తం

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

మంచిర్యాలనేరవిభాగం: అక్టోబరు 21 పోలీసు ఫ్లాగ్ డే సందర్భంగా పోలీసుశాఖ విధులపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ షార్ట్‌ఫిల్మ్‌లను 20వ తేదీలోపు కమిషనరేట్‌లోని ఎన్ఐబీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని చెన్నూరు అటవీశాఖ డీఆర్వో ప్రభాకర్ అన్నారు. 70వ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని అక్కెపల్లి గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేటాడితే కఠినమైన శిక్షలు ఉంటాయని సూచించారు.

ప్లాస్టిక్‌ను వినియోగించవద్దు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దుకాణదారులు ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గూడెం గ్రామ పంచాయతీని మంగళవారం సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. చెత్తవేసే వారిపై జరిమానా విధించాలని కార్యదర్శికి సూచించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

నిర్బంధ తనిఖీలతో నేరాల నియంత్రణ

కాసిపేట, న్యూస్‌టుడే: నిర్బంధ తనిఖీలతో నేరాలు నియంత్రించవచ్చని సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ట్యాంకు బస్తీలో పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 36 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను గుర్తించారు. గొలుసు దుకాణంలో రూ.7606 విలువైన మద్యం స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. కాసిపేట ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

మంచిర్యాల సిటీ: జిల్లా కేంద్రంలో భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే ముల్కల్ల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

★ జిల్లా కేంద్రంలోని ముల్కల మల్లారెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. ఏమాజీ, గోలి రాము, మధుసూదన్‌రావు, అశోక్‌వర్ధన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

లక్షెట్టిపేట: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొస్తున్న గర్భిణుల వివరాలు, 102 అంబులెన్స్ సేవల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అందిస్తున్న సేవలను ప్రదర్శించాలని ఆయన సూచించారు. ప్రోగ్రాం అధికారి ప్రసాద్, అనిల్ కుమార్, ఫయాజ్, వైద్యాధికారులు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.


వెంకట్రావుపేటలో వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఏర్పాట్లు

జన్నారం: ఈ నెల 10న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వాగు సమీపంలోని భూ యజమానుల నుంచి అనుమతి తీసుకొని అక్కడ విద్యుత్తు దీపాల అలంకరణ, బతుకమ్మ ఆడుకునేలా నేలను చదును చేయించే పనులను మంగళవారం చేపట్టారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్‌అలీఖాన్, మాణిక్యం, రాజశేఖర్, సుభాష్‌రెడ్డి ఉన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వారికి జైలు శిక్ష

బెల్లంపల్లి గ్రామీణం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు తాళ్లగురిజాల ఎస్సై రమేష్ తెలిపారు. బూదకలాన్‌కు చెందిన జంగంపల్లి సాయిహర్షిత్, కోట శశిలు మద్యం తాగి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముందు ప్రవేశపెట్టగా వారికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

భాజపా నాయకుల సంబరాలు

చెన్నూరు పట్టణం, జన్నారం, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాజపా హ్యాట్రిక్ విజయం సాధించడం పట్ల మంగళవారం చెన్నూరు, జన్నారంలో ఆపార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, గాంధీచౌక్‌లో బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ హరియాణా ప్రజలు మంచి తీర్పునిచ్చారని అన్నారు. భాజపా మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, శంకరయ్య పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై కపట ప్రేమ చూపిస్తున్నాయని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేసేందుకు ఆసక్తి చూపుతూ తక్కువ బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయన్నారు. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు ఒకే చోట విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు మోతె జయకృష్ణ, ఆయా సంఘాల నాయకులు, ఆసంపల్లి రమేష్, జాకీర్, కుమార్, నాగలక్ష్మి, కొండయ్య, శ్రీమన్నారాయణ, లాల్‌కుమార్, చరణ్, రాజేశం పాల్గొన్నారు.

సన్న రకాలకు రూ.500 బోనస్

ఏసీసీ, న్యూస్‌టుడే: ఎక్కడా పొరపాట్లు జరగకుండా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చొప్పున మద్దతు ధర, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో టార్పాలిన్‌లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులు విస్తరణాధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్ల అనంతరం రైతులకు రశీదులు ఇవ్వాలని సంబంధిత వివరాలు రిజిస్టర్‌లో నమోదుచేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో ట్యాబ్‌లలో ఎంట్రీలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా అధికారులు కిషన్, బ్రహ్మారావు, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్